క్లుప్తంగా

క్లాప్ వాహనాలను సక్రమంగా నడపాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో క్లాప్ వాహనాలను సక్రమంగా నడపాలని నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన పాత బస్టాండు, అల్మాస్ పేట తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. కేటాయించిన సమయానికి క్లాప్ వాహనాలు ఆయా ప్రాంతాలకు వెళ్లాలన్నారు. ఉదయాన్నే చెత్త పాయింట్లు శుభ్రం చేయాలని, మధ్యాహ్నం డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ రవీందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగ సుబ్బయ్య పాల్గొన్నారు.

మహా సభను జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఈనెల 5వ తేదీన కడప నగరంలోని కృష్ణా సర్కిల్ వద్ద ఉన్న షాహి దర్బార్ మీటింగ్ హాలులో నిర్వహించే ఆప్ కీ ఆవాజ్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సంస్థ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాష పిలుపునిచ్చారు. సోమవారం తమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి పరిస్థితుల్లో ముస్లిం మైనార్టీలు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని, వీరిని చైతన్య పరచడం కోసం భవిష్యత్తులో ముస్లిం మైనార్టీల హక్కు ల సాధన కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో నూతన జిల్లా కమిటీ ఎన్నిక అనంతరం భవిష్యత్తు కార్యచరణపై చర్చిస్తామని ఆయన వివరించారు.

డాక్టరేట్ ప్రదానం


ఆంజనేయులు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం కామర్స్ శాఖ స్కాలర్ కొప్పుల ఆంజనేయులకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈయన వైవీయూ కామర్స్ శాఖ ఆచార్యులు జి. విజయభారతి పర్యవేక్షణలో 'ఆకుపేషనల్ డైవర్సిఫికేషన్ అండ్ వీవర్స్ ఎంటర్‌ప్రైజ్ సస్టె నబిలిటి – ఎ కంపేరటివ్ స్టడీ'లో పరిశోధన చేసి విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఉపకులపతి మార్గదర్శకత్వంలో నియమితులైన నిపుణుల కమిటీ అంజనేయులు సమర్పించిన థీసిస్ ను పరిశీలించి డాక్టరేట్ అర్హత ఉందంటూ నిర్ణయించారు. ఈ మేరకు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కెఎస్వీ కృష్ణా రావు ఆంజనేయులకు డాక్టరేట్ ప్రకటించారు.

క్రైస్తవ చిహ్నాన్ని ఏర్పాటు చేయాలి

కడప కార్పొరేషన్ : మూడు మతాలను సమానంగా చూడ వలసిన అధికారులు, పాలకులు రెండు మతాలకు ప్రాధాన్యతలు కల్పించి ఒక మతాన్ని విస్మరించటం వారి మనోభావాలను దెబ్బతీయడమే అవుతుందని, క్రై స్తవులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ క్రై స్తవ నమూనాను ఏర్పాటు చేయాలని క్రై స్తవ నమూనా సాధన కమిటీ సభ్యులు మడగలం ప్రసాద్, జ్యోతి జార్జి, సీహెచ్ విజయ్ బాబు, శేఖర్, అల్లూరి జోజప్ప కోరారు. ఈ మేరకు సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు, నగర మేయర్ కె.సురేష్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నగరంలోని ప్రధాన కూడళ్లను ఎంతో సుందరంగా తీర్చిదిద్దారని, హిందువులకు ముస్లింలకు సంబంధించిన నమూనాలను నెలకొల్పారని చెప్పారు. క్రై స్తవులకు చెందిన నమూనాలని మరిచారని వారు గుర్తు చేశారు.

నేడు నిరసన

కడప కల్చరల్: బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐ, విదేశీ బీమా కంపెనీల ప్రవేశానికి వ్యతిరేకంగా మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎల్‌ఐసీ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అవధానం శ్రీనివాస్, ఎ.రఘునాథ్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఈ మేరకు వారు 'బీమా చట్ట సవరణ బిల్లును తిరస్కరిద్దాం' పేరుతో కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లు 2024 ను ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ సవరణలతో దేశానికి కానీ, పాలసీదారులకు కానీ ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఈ చట్ట సవరణ బిల్లును తీవ్రంగా ప్రతిఘటిద్దామని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు అక్బర్ బాషా, వసుప్రద, వారిజా తమ్మ, రత్నకిషోర్, జె.రఘు శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడప అర్బన్: ఏపీ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, జిల్లా పోలీస్ కార్యాలయ ఏ.ఓ ఎన్.జ్యోతి, ఏపీ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ జి. అగస్టీన్ బాబు, వైస్ ప్రెసిడెంట్ జి. రాజేశ్వరి, సెక్రటరీ పి. ఆనంద్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ఎస్. నాగమణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. మనోహర్, సభ్యుడు ఎం. కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తజనం

దేవుని కడపలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నిర్వహించిన కడపరాయుడి కల్యాణానికి జిల్లా వ్యాప్తంగా భక్తులు తరలి వచ్చారు. రాత్రి స్వామివారిని గజ వాహనంపై ఊరేగించారు. - కడప కల్చరల్


గజ వాహనంపై దర్శనమిస్తున్న కడపరాయుడు


స్వామివారి కల్యాణాన్ని, తిలకిస్తున్న భక్తజనం

దయగల తల్లి లూర్దుమాత


ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు


లూర్దుమాత సందేశాన్ని అందజేస్తున్న రెవరెండ్ ఫాదర్ సగిలి దేవదాస్

కడప కల్చరల్ : లూర్దుమాత కరుణ చూపే దయగల తల్లి అని మదనపల్లె విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ సగిలి దేవదాస్ అన్నారు. లూర్దుమాత తిరునాల ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. నవదిన కార్యక్రమాల్లో భాగంగా రెండవరోజు సోమవారం సాయంత్రం 5.30 గంటలకు మరియాపురంలోని పెద్ద చర్చి ఆవరణలో విశేష ప్రార్ధనలు చేశారు. తొలుత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీపై లూర్దుమాత స్వరూపాన్ని నిలిపి విశ్వాసులు ఊరేగింపుగా మరియాపురం వీధుల ద్వారా స్తుతి గీతాలు ఆలపిస్తూ ప్రధాన ప్రార్థనా వేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆ స్వరూపాన్ని వేదికపై ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ సగిలి దేవదాస్ దివ్య బలిపూజ నిర్వహించగా, ఉరుటూరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ కాసు జోజిరెడ్డి ప్రధాన ప్రసంగం చేశారు.

ఈ ఉత్సవాల సందర్భంగా ఆమెను దర్శించుకుని ప్రార్ధనలు చేసిన వారికి మంచి ఫలితాలు లభించగలవని తెలిపారు. ఉత్సవాలలో భాగంగా పీఠాన్ని అలంకరించి స్తుతి గీతాలను ఆలపించిన కారుణ్య సంఘం సభ్యులు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తిరునాల కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు ప్రింట్ చేయవద్దు

కడప కార్పొరేషన్: కడప నగర పాలక సంస్థ పరిధిలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ప్రింట్ చేయవద్దని వాటిని ఏర్పాటు చేయుటకు కడప నగర పాలకసంస్థ అనుమతి ఇవ్వదని కమిషనర్ మనోజ్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం నగరంలోని ఫ్లెక్సీ ప్రింటర్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ఎవరు ఫ్లెక్సీలు, బ్యానర్లు ప్రింట్ చేయవద్దని, వాటిని నగరంలో ఏర్పాటు చేసేందుకు చలానాలు ఇవ్వబోమని తెలిపారు.

మా జీవనోపాధి సంగతేంటి..?

నగరంలో ఫ్లెక్సీలు బ్యానర్లను నిషేధిస్తే తమ జీవనోపాధి పరిస్థితి ఏంటని ఫ్లెక్సీ ప్రింటర్ల యజమానులు మండిపడుతున్నారు. నగరంలో సుమారు 15 ఫ్లెక్సీ ప్రింటర్స్ ఉన్నాయని, వాటిపై ప్రత్యామ్నాయంగా పరోక్షంగా వందలాదిమంది కార్మికులు, వారి కుటుంబాలు ఆధారపడి ఉన్నారన్నారు. ఇలా ఉన్నట్టుండి చలానాలు నిలిపేస్తున్నామని, ఫ్లెక్సీలు బ్యానర్లు ప్రింట్ చేయవద్దని అంటే ఎలాగని వారు ప్రశ్నిస్తున్నారు. సరైన కారణం లేకుండా ఇలా చేయడం సరికాదని దీనిపై కలిసికట్టుగా పోరాటం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించండి

కడప అర్బన్: ట్రాఫిక్ రూల్స్ పాటించి , ప్రమాదాలకు దూరంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ డి.కె జావీద్ అన్నారు. జె.కే జనంకోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఆర్‌కె రాయల్ కరీముల్లా సేవా సమితి ఆధ్వర్యంలో తయారు చేసిన పోస్టర్లను ట్రాఫిక్ సీఐ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. అతి వేగం ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు.

అన్నదానం

కడప కార్పొరేషన్ : పేదల ఆకలి తీర్చడం పుణ్యకార్యంగా భావించాలని నగర ప్రముఖులు సుభాన్ బాష పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి కడప సీఎస్ఐ స్కూల్ (1978 బ్యాచ్) పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కడప ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సోమవారం కూడా అన్నదానం చేశారు. సుభాన్ బాషా మాట్లాడుతూ ఎంతో మంది పేదలు తమ పనుల నిమిత్తం దూరాభారం నుంచి కడప పట్టణం కు వస్తుంటారాని, వారికి భోజనాలు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ కరీం, రఫీక్, విజయ్ కుమార్, సుకుమార్, జయ కుమార్, జోహర్ ,ఉస్మాన్ ఖాన్, గౌస్ చాక్లెట్, సుల్తాన్ బాబా, అలీ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరాలపై సీఐ బి. రామకృష్ణ ఆదేశాల మేరకు ఎస్ఐ జి. అమర్‌నాథ్‌రెడ్డి, సిబ్బందితో పిఎఫ్ ఆఫీస్ ఎదురుగా గల వీధిలో ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.6730ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఆదర్శవంతంగా 'బాలగొండ' పర్యాటక సేవలు

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన చరిత్ర ఉపన్యాసకులు బాలగొండ గంగాధర్ ఈ ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం చేస్తున్న కృషి ఆదర్శవంతమైనదని వక్తలు పేర్కొన్నారు. సత్కార గ్రహీత బాలగొండ గంగాధర్ సమాచారం ప్రకారం ..సోమవారం హైదరాబాదులోని రవీంద్రభారతి మినీ ఆడిటోరియంలో లలిత కళాభిరామ పింఛము సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు జిల్లాకు చెందిన శిల్పకారుడు గొల్లపల్లి జయన్న, మంజులరాణిల ఆధ్వర్యంలో జిల్లా పర్యాటక రంగంలో విశేష సేవలు అందించిన బాలగొండ గంగాధర్‌ను సన్మానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక ఎక్సలెన్స్ అవార్డు బాలగొండకు లభించడం జిల్లా వాసులకు గర్వకారణమన్నారు.

ఈ కార్యక్రమానికి దూరదర్శన్ పూర్వ అధికారి ఓలేటి పార్వతీశం, కళాకారులు, శిల్పకారులు జీవై గిరి, ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జీపీడీ క్రిస్టి, రచయిత డాక్టర్ ఎక్కలూరి శ్రీరాములు, అన్నమరాజు ప్రభాకర్‌రావులు అతిథులుగా హాజరయ్యారు.

ఎస్పీని కలిసిన నేతలు

కడప అర్బన్: జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్‌ను సోమవారం పలువురు నేతలు కలిశారు. కడప నగర శివార్లలోని బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఏటూరి రామచంద్రారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందచేశారు. అలాగే జిల్లా ఎస్పీ ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతితో పాటు కాంగ్రెస్ నాయకులు ప్రత్యేకంగా కలిసి, పూలమొక్కను అందచేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ లక్ష్యంగా అడుగులు


మాట్లాడుతున్న వైవీయూ వీసీ కె. కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ లక్ష్యంగా యోగి వేమన విశ్వవిద్యాలయం పయనిస్తోందని, అందులో భాగంగా దూరవిద్యలో పటిష్టం చేస్తున్నామని యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి ఉద్ఘాటించారు. సోమవారం వైవీయూలోని అన్నమాచార్య సెనెట్ హాల్లో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీవోఈ) డైరెక్టర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం దూరవిద్య ద్వారా 8 కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఎంబీఏ(జనరల్), ఎంబీఏ (హెచ్‌ఆర్‌ఎం) కోర్సులు తీసుకురానున్నామని ప్రకటించారు. వైవీయూ దూరవిద్య గురించి అందరూ విస్తృత ప్రచారం కల్పించాలని, ఉన్నత విద్యను అందరూ అభ్యసించాలన్నారు. దూరవిద్యను సులభతరం చేస్తూ సకాలంలో కోర్సు పూర్తిచేసే సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. విశ్వవిద్యాలయ ప్రధానాచార్యులు ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి , విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య పుత్తా పద్మ మాట్లాడారు. దూరవిద్య ఉప సంచాలకులు డా. ఎం. శ్రీధర్ బాబు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ హుమానిటీస్ డీన్ ఆచార్య కె. గంగయ్య, ఆచార్యులు బాయినేని శ్రీనివాసులు, ఎస్.ఈశ్వరరెడ్డి, టి. రామప్రసాద్ రెడ్డి, విజయభారతి, అనిత, గంజి పార్వతి, జి. పార్వతి, మెర్సీ విజేత, వినోదిని, అసోసియేట్ ప్రొఫెసర్లు, పలు కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు

అక్షరాభ్యాసం


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

కడప కల్చరల్ : చదువుల మాత శ్రీ సరస్వతిదేవికి వసంత పంచమి సందర్భంగా సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. దుర్గ, లక్ష్మీ, సరస్వతిగా ఏకరూపమైన విద్యావాణి చదువుల తల్లికి కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సామూహికంగా చిన్నారులను కూర్చొబెట్టి అర్చక బృందం వేదమంత్రయుక్తంగా ఆశీర్వదించి వారిచేత అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జున రావు, ఆలయ నిర్వాహకులు దుర్గా ప్రసాద్ అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

వసంత పంచమి విశిష్టమైన రోజు

'వసంత పంచమి' రోజు సరస్వతీ దేవిని ఆరాధించినవారి జీవితాల్లో వెలుగులు నిండుతాయని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి అన్నారు. కడపలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృతశాఖ ఆధ్వర్యంలో సోమవారం 'వసంత పంచమి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన డా.చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ వసంత పంచమి విశిష్టత తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ కుంభమేళా వంటి గొప్ప కార్యక్రమాలకు 'వసంత పంచమి' ప్రత్యేక రోజుగా భావిస్తారన్నారు. సంస్కృత శాఖాధిపతి డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం చింతకుంట శివారెడ్డిని సత్కరించారు.




దేవుని కడపలోని కడప రాయుని ఆలయ రథం

నేడు కడపరాయుడి రథోత్సవం

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం సోమవారం మధ్యాహ్నం రథోత్సవానికి ముందస్తు ఏర్పాట్లలో భాగంగా కలశ, ధ్వజ ప్రతిష్ఠలు చేశారు. తేరు పీఠం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను ప్రతిష్ఠించారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులను తేరుపైకి వెళ్లి స్వామిని దర్శించుకునే అవకాశం కల్పించనున్నారు. తెల్లవారుజాము నుంచే సమీప గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున స్వామి దర్శనం కోసం బారులు తీరి వేచి ఉంటారు. మధ్యాహ్నం రథోత్సవానికి సైతం కడప నగరం నుంచే కాకుండా చుట్టుపక్కల గల గ్రామాలకు చెందిన ప్రజలు వస్తారు. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత రథాన్ని మాడ వీధుల్లో తిప్పేందుకు దేవుని కడప, పాత కడప పెద్దలు, యువకులు ఉత్సాహంగా పోటీలు పడతారు. కదం తొక్కుతూ రథాన్ని నడిపించడం ఆనవాయితీగా వస్తోంది.

మనజిల్లాలో దేవుని కడప బ్రహ్మోత్సవాల్లో జరిగే రథోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ ఉత్సవంలో ఉపయోగించే రథం భారీగా ఉంటుంది. కడప రాయుడిని కుల దైవంగా భావించే పాత కడప, దేవుని కడప గ్రామ పెద్దల పూజల తర్వాతే సర్కార్ హారతిగా టీటీడీ స్థానిక అధికారులు మంగళ హారతులు ఇచ్చి రథాన్ని కదిలించి యాత్రను ప్రారంభిస్తారు. యేటా రథోత్సవానికి పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ అర్చక బృందం టీటీడీ అధికారులకు కొన్ని సూచనలు చేసింది. రథోత్సవం సందర్భంగా తేరుపై ప్రతిష్ఠించే స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున జనం వస్తారు. వేదికపై ఒక్కరు కూడా పూర్తిగా నిలబడి దర్శించుకునేందుకు వీలు కాని రీతిలో పీఠం వెడల్పు చాలా తక్కువగా ఉంది. దీన్ని గుర్తించిన అర్చకులు పీఠాన్ని రెండు వైపుల వెడల్పుగా మార్చి విశాలమైన వేదికలా ఏర్పాటు చేయాలని కోరారు. వారి సూచనల మేరకు అధికారులు తేరు ముందు భాగంగా ఎదురుగా ఈ పీఠంపై నిలబడి స్వామిని దర్శించుకునే అవకాశం లభించింది.

ఈ రథానికో చరిత్ర..

స్థానిక భక్తులు, అర్చకుల సమాచారం ప్రకారం కడప రాయుని రథాన్ని వందేళ్ల క్రితం నిర్మించారు. రథానికి వాడిన ఇనుప ఇరుసులు, రథం లాగేందుకు ఉపయోగించే ఇనుప గొలుసులను ప్రత్యేకంగా లండన్ నుంచి ఓడలో తెప్పించారని చెబుతారు. రథంపై శిల్పాలను తమిళనాడులో కళాత్మకంగా రూపొందించారని, నాటి ధార్మిక, సమాజ సేవకులు, వైశ్య ప్రముఖులు ముత్యాల శేషయ్య ఈ రథాన్ని తయారు చేయించడంలో ప్రధానపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఈ రథానికి మరో విశిష్టత కూడా ఉంది. దీనికి సాధారణంగా నాలుగు చక్రాల తోపాటు వాటి మధ్యలో మరో రెండు చిన్న చక్రాలున్నాయి. ప్రధాన చక్రాల్లో ఏదైనా అనుకోకుండా దెబ్బ తిన్నప్పుడు ఎలాంటి ఆటంకాలు లేకుండా రథాన్ని నడిపేందుకు ఈ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దేవుని కడప ఆలయం మినహా జిల్లాలోని ఇతర ఏ ఆలయానికి చెందిన తేరుపైన సాధారణ భక్తులు ఉండేందుకు వీలు లేదు. ఆ అవకాశం కేవలం కడప రాయుని ఆలయానికే పరిమితం. దీంతో భక్తులు సంతోషంగా రథంపైకి ఎక్కి దేవదేవుని దర్శించుకుంటారు.

తిరునాలకు సర్వం సిద్ధం..

రథోత్సవం సందర్భంగా దేవుని కడపలో తిరునాల జరుగుతుంది. నగరంలోని కృష్ణా సర్కిల్ నుంచి రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే చెరువు కట్ట వద్ద నుంచి దేవునికడప ఆలయం వద్ద వరకు బయటి ప్రాంతాల వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. పలుచోట్ల ఉచితంగా మంచి నీటిని పంపిణీ చేసి కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం రెండు, మూడు చోట్ల భారీగా అన్నదానాలు కూడా చేపట్టనున్నారు. పోలీసులు రహమతీయ ఫంక్షన్ హాలు వద్ద నుంచి వాహనాలను నియంత్రించనున్నారు.

రథసప్తమికి భారీ బందోబస్తు

కడప అర్బన్: దేవుని కడప శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రథసప్తమి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో కలిసి దాదాపు 300 మందితో విధులను నిర్వహించనున్నారు. కడప రాయుడి రథోత్సవానికి జిల్లా వ్యాప్తంగా భక్తులు భారీగా తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.